మజ్లిస్ ఆగడాలకు బీజేపీతోనే అడ్డుకట్ట

కేంద్రమంత్రి కిషన్ రెడ్డి



ఎక్కాల చైతన్య కన్నాకు బీజేపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

కాచిగూడ: పాతబస్తీలో మజ్లిస్ ఆగడాలకు వ్యతిరేకంగా పోరాడేది ఒక్క బీజేపీ మాత్రమేనని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ కాచిగూడ మాజీ కార్పొరేటర్ ఎక్కాల చైతన్య కన్నా తన అనుచరులతో శనివారం బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా బర్కత్‌పురలోని బీజేపీ నగర కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కిషన్‌రెడ్డి పాల్గొని ఎక్కాల చైతన్యకన్నాతోపాటు చేరిన బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలందరికి బీజేపీ కండువా కప్పి వారిని పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ హైదరాబాద్ పార్లమెంటరీ స్థానంలో బీజేపీ గెలవబోతుందన్న భయం పట్టుకున్న మజ్లిస్ పార్టీ అధినేత అసదుద్దీన్ ఒవైసీ ఢిల్లీ వెళ్లి కాంగ్రెస్ పెద్దల ఆశీర్వాదం తీసుకున్నారని అన్నారు. అధికారంలో ఉన్న పార్టీకి మద్దతు తెలుపుతూ తమ గూండాగిరిని, అవినీతి అక్రమాలను కొనసాగిస్తుందన్నారు. పాతబస్తీలో మజ్లిస్ ఆగడాలతో ఒక వర్గం బస్తీలే లేకుండా చేశారని ఆరోపించారు. అందరూ ఐక్యమై బీజేపీకి ఓటు వేసి మజ్లిస్ పార్టీకి గుణపాఠం చెప్పాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతంరావు, సీనియర్ నేతలు మర్రి శశిధర్ రెడ్డి, పీఎల్ శ్రీనివాస్, ఎక్కాల కన్నా, సి.నందకిషోర్ యాదవ్, ఎక్కాల నందు, ఎ.అజయ్ కుమార్, వనం రమేష్, రాజశేఖర్ రెడ్డి, ఎ.సూర్యప్రకాష్ సింగ్, అరవింద్, కృష్ణ కుమార్, శీర్‌సాగర్ తదితరులు పాల్గొన్నారు.

చరిత్రకు సజీవసాక్ష్యం ఫొటోగ్రఫీ: ఆర్.కృష్ణయ్య



సదస్సులో మాట్లాడుతున్న ఆర్.కృష్ణయ్య

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: చరిత్రకు సజీవసాక్ష్యం ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీలని అని రాజ్యసభ సభ్యులు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య అన్నారు. వంద పుస్తకాలను చదివితే గుర్తుండిపోదని, అదే ఒక ఫొటో బతికి ఉన్నంత కాలం సజీవసాక్ష్యంగా నిలిచి ఉంటుందని అన్నారు. ఈ రంగంపై ఎన్నో కుటుంబాలు ఆధారపడి ఉన్నాయని, ప్రభుత్వం వీరిని ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఫ్రీలాన్స్ ఫొటోగ్రాఫర్స్, వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ రూపొందించిన నూతన డైరీ ఆవిష్కరణ సభ జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీ వృత్తిని స్వయం ఉపాధి కింద తీసుకువచ్చి బీసీ, ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్‌ల ద్వారా సబ్సిడీ రుణాలు అందించడానికి రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతానని హామీ ఇచ్చారు. ఫొటోగ్రాఫర్లు, వీడియోగ్రాఫర్ల అభివృద్ధి కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు జి.శ్రీధర్, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎ.రుషీశ్వర్, జి.కరుణాకర్, కోశాధికారి ఎం.వేణు, సంయుక్త కార్యదర్శి ఎం.ఉదయ్, ఉపాధ్యక్షులు కె.వీరేష్, కె.కుమార్, ఎస్.శ్రీనివాస్, మహ్మద్ హబీబ్, నాయకులు పి.కృష్ణ, కార్యనిర్వాహక కార్యదర్శి వెంకీయాదవ్, వై.చందు, సలహాదారులు కె.రఘురాం పాల్గొన్నారు.



ఆరేళ్లు గడిచినా ఇంకా అసంపూర్తి!

- కిలోమీటరున్నర దూరానికి ఇంత సమయమా?
- వాహనచోదకుల అవస్థలు

ఇదీ అంబర్‌పేట ఫ్లైఓవర్ దుస్థితి

అంబర్‌పేట: ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అంబర్‌పేట ఫ్లైఓవర్ పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఏళ్లు గడిచినా ఇంకా నిర్మాణపనులు కొనసాగుతుండటంతో ప్రజలు, వాహనదారులు అవస్థలు పడుతున్నారు. ఫ్లైఓవర్ నిర్మాణానికి శంకుస్థాపన చేసి ఆరేళ్లు దాటినా ఇప్పటివరకు పూర్తికాలేదు. గోల్నాక చర్చ్ నుంచి ‘చే నంబర్’చౌరస్తా, శ్రీరమణ చౌరస్తాల మీదుగా ఇరానీ హోటల్ వరకు కిలోమీటరున్నర దూరం మేరకు ఫ్లైఓవర్ నిర్మాణం జరుగుతోంది. శ్రీరమణ చౌరస్తా నుంచి చే నంబర్ చౌరస్తా వరకు ఎనిమిది నెలలుగా రాకపోకలు నిలిచిపోవడంతో వాహనదారులు, స్థానిక ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు.

ఆరేళ్లు గడిచినా...

అంబర్‌పేట ఫ్లైఓవర్ పనులు ఆరేళ్ల క్రితం అప్పటి కేంద్రమంత్రి నితిన్ గడ్కరి చేతుల మీదుగా ప్రారంభమయ్యాయి. దీనిని 1.5 కిలోమీటర్ల పొడవు, 47 పిల్లర్లతో నిర్మించ తలపెట్టారు. ఈ మేరకు రూ.370 కోట్లతో పనులను ప్రారంభించారు. ఇందులో 281 ఆస్తులను ఫ్లైఓవర్ కోసం ప్రజల నుంచి సేకరించారు. ఇప్పటికి దాదాపు 60 నుంచి 70 శాతం పనులు పూర్తి అయ్యాయి. మిగిలిన 40 నుంచి 30 శాతం పనులు పూర్తి కావాడానికి ఇంకా ఎన్నేళ్లు పడుతుందో అర్థంకాని పరిస్థితి.



ఫ్లైఓవర్ నిర్మాణం జరుగుతున్న ఛే నంబర్ చౌరస్తాలో నిలిచిన మురుగునీరు

ట్రాఫిక్‌తో అవస్థలు..

అంబర్‌పేట్‌లో నిర్మించే ఫ్లైఓవర్ వరంగల్ జాతీయ రహదారిపై కావడంతో ట్రాఫిక్ తీవ్రంగా ఉంటుంది. నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగించే ఈ రహదారిపై ఫ్లైఓవర్ నిర్మాణం సాగుతుండడంతో గత కొన్నేళ్లుగా వాహనాదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. అధికారికంగా ట్రాఫిక్ మళ్లింపు చర్యలు ఉండటంతో జిల్లాల నుంచి వచ్చే బస్సులతోపాటు స్థానిక బస్సులు, వాహనదారులు ఫ్లైఓవర్ నిర్మాణ ప్రాంతంలో నానా తిప్పలు పడుతున్నారు. ప్రత్యామ్నాయ రోడ్లను సహితం సరిగ్గా అందుబాటులోకి తేలేదు.

కనీస చర్యలు కరువు

ఫ్లైఓవర్ నిర్మాణ ప్రాంతాల్లో రోడ్లన్నీ గుంతలమయంగా మారాయి. నాలాలు, మంచినీటి పైపులైన్‌లు, డ్రైనేజీ వ్యవస్థలు ధ్వంసం అయ్యాయి. నిర్మాణ సమయంలో చేపట్టిన పైపులైన్‌లతో నీరు, డ్రైనేజీ పొంగిపొర్లుతుండటంతో రాకపోకలు సాగించే దారుల్లో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఫ్లైఓవర్ నిర్మాణం జాప్యంపై గత బీఆర్ఎస్, కేంద్రంలోని బీజేపీ నేతలు ఒకరిపై మరొకరు రాజకీయ విమర్శలు చేసుకుంటున్నారు. అప్పటి రాష్ట్ర ప్రభుత్వం స్థల సేకరణలో జాప్యం చేసిందని బీజేపీ నేతలు ఆరోపిస్తున్నారు.



అంబర్‌పేటలో కొనసాగుతున్న ఫ్లైఓవర్ నిర్మాణపనులు

జాతీయ చేనేత సిల్క్ ఎక్స్‌పో ప్రారంభం



జాతీయ చేనేత వస్త్ర ప్రదర్శనను ప్రారంభిస్తున్న వేణుగోపాలచారి, రిటైర్డ్ జడ్జి మధుసూదన్

కవాడిగూడ: దేశవ్యాప్తంగా ఉన్న చేనేత చేతివృత్తుల వారు తయారు చేసిన వస్తువులు, వస్త్రాలను కొనుగోలు చేసి చేనేత పరిశ్రమను ప్రోత్సహించాలని కేంద్ర మాజీమంత్రి సముద్రాల వేణుగోపాలచారి అన్నారు. శనివారం రాత్రి నగరంలోని ఎన్‌టీఆర్ స్టేడియంలో అభ్యుదయ గ్రామీణ డ్వాకా రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జాతీయ చేనేత సిల్క్ ఎక్స్‌పో ఎగ్జిబిషన్‌ను వేణుగోపాలచారి, రిటైర్డ్ జడ్జి మధుసూదన్‌రావు ముఖ్యఅతిథులుగా హాజరై ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ సరసమైన ధరలకు లభించే ఈ అవకాశాన్ని నగర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అభ్యుదయ గ్రామీణ డ్వాకా రాష్ట్ర కమిటీ అధ్యక్షురాలు పోటా దేవకీదేవి మాట్లాడుతూ ఈ ప్రదర్శన నెలరోజుల పాటు కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు సత్యనారాయణ చౌదరి, సాయిచౌదరి, నదీం, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాధికార సాధనే నిజమైన నివాళి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: బహుజనులకు రాజ్యాధికారం దక్కినప్పుడే మహనీయులకు నిజమైన నివాళి అర్పించినట్లు అవుతుందని అఖిల భారతీయ పద్మశాలి సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి సూరెపల్లి రవికుమార్ అన్నారు. శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో అఖిల భారతీయ పద్మశాలి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ‘బహుజనుల రాజ్యాధికారం- కులసంఘాల పాత్ర’ అనే అంశంపై రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కులసంఘాలు ఓటుకు అమ్ముడుపోవడం వల్ల అగ్రకులాల వారు రాజ్యాధికారాన్ని చేపడుతున్నారని అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీలు ఏకతాటిపైకి వచ్చి రాజ్యాధికార సాధనే లక్ష్యంగా ముందుకు సాగాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ అంబేడ్కరైట్ జె.బి.రాజు, సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ రత్నం, అఖిల భారతీయ పద్మశాలి సంఘం అధ్యక్షులు తుమ్మ సత్యనారాయణ, ప్రముఖ విద్యావేత్త వడ్డెపల్లి కృష్ణ, పద్మశాలి సంఘం జాతీయ నాయకులు డాక్టర్ చిక్కా దేవదాస్, కొప్పుల దేవేందర్, అశోక్ పాల్గొన్నారు.

అంబేడ్కర్‌కు అవమానం

చిక్కడపల్లి: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటంపై ఇసుక, సిమెంట్ వేసి అవమానించేవిధంగా వ్యవహరించినవారిపై చర్యలు తీసుకోవాలని శాంతి యువజన సంఘం బస్తీవాసులు కోరారు. శనివారం గాంధీనగర్‌లోని శాంతి యువజన సంఘం బస్తీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బస్తీ అధ్యక్షుడు ఎన్.పెంటయ్య, ఎస్.రాజు, వేణుగోపాల్, ఇ.సాయి మాట్లాడారు. బస్తీలో ఉన్న ఖాళీ స్థలంలో ప్రతి ఏడాది అంబేడ్కర్ జయంతిని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ఖాళీ స్థలం పక్కనే ఉన్న ఓ వ్యక్తి భవనం నిర్మిస్తూ కబ్జా చేశారని, ఈ విషయమై కోర్టు స్టే విధించిందని వివరించారు. ఈ క్రమంలో అక్కడే ఉన్న అంబేడ్కర్ చిత్రపటంపై సిమెంట్, ఇసుక వేసి ఆయనను అవమానించారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జీహెచ్ఎంసీ అధికారులకు ఫిర్యాదు చేసిన లాభం లేకుండా పోయిందని తెలిపారు. బస్తీ సంఘం నాయకులు, షాబుద్దీన్, ఇ.గణేశ్‌కుమార్ పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా అధికార ప్రతినిధిగా ధనుంజయ



అంబర్‌పేట: బీజేపీ సెంట్రల్ జిల్లా అధికార ప్రతినిధిగా బాగ్ అంబర్‌పేటకు చెందిన ఈఎస్ ధనుంజయ నియమితులయ్యారు. శనివారం సెంట్రల్ జిల్లా అధ్యక్షులు గౌతమ్‌రావు చేతులమీదుగా ఆయన నియామకపత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా ధనుంజయ మాట్లాడుతూ పార్టీ అప్పగించిన బాధ్యతలను విజయవంతంగా నిర్వహిస్తానని తెలిపారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, మాజీ మంత్రి కృష్ణయాదవ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు కృష్ణగౌడ్, శ్యామ్‌రాజ్, యెడెల్లి అజయ్‌కుమార్, చుక్క జగన్ పాల్గొన్నారు.

ఆర్యభట్ట స్కూల్ ‘గ్రాడ్యుయేషన్ డే’

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రైవేటు విద్యాసంస్థలు సైతం తమ వంతు కృషి చేయడం అభినందనీయమని ప్రముఖ విద్యావేత్త భాస్కర్‌రెడ్డి అన్నారు. శనివారం సుందరయ్య విజ్ఞానకేంద్రంలో ఆర్యభట్ట హైస్కూల్ నల్లకుంట గ్రాడ్యుయేషన్ డే సెర్మనీ జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హాజరైన భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల అభ్యున్నతి కోసం ఉపాధ్యాయులు ప్రణాళికాబద్ధంగా పనిచేయాలన్నారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన పలు సంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అనంతరం విద్యార్థులకు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యభట్ట హైస్కూల్ డైరెక్టర్స్ బి.ఆనందరెడ్డి, ఎం.చంద్రశేఖర్, ఎం.మాధవీలత, ప్రముఖ విద్యావేత్త మహేష్, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

‘గ్రేట్ క్రికెట్ స్టెప్స్’ లోగో ఆవిష్కరణ

కాచిగూడ: గ్రేట్ క్రికెట్ స్టెప్స్ అసోసియేషన్ హైదరాబాద్ లోగోను శనివారం రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ, హైదరాబాద్ ఇంచార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో తెలంగాణ యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి అరవింద్ కుమార్ యాదవ్, సీనియర్ కాంగ్రెస్ లీడర్ మహమ్మద్ జహంగీర్, అసోసియేషన్ సెక్రెటరీ బి.హర్షవర్ధన్ పాల్గొన్నారు.

‘రాజ్యాధికారమే లక్ష్యంగా ముందుకెళ్లాలి’

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: రిజర్వేషన్‌ల పెంపు, బడ్జెట్ కేటాయింపుల డిమాండ్లతో మాత్రమే కాకుండా రాజ్యాధికార తపనతో ముందుకు వెళ్లినప్పుడే మనల్ని మనం అభివృద్ధి చేసుకోగలమని మాజీ ఎంపీ రాపోలు ఆనందభాస్కర్ అన్నారు. శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సామాజిక న్యాయ జేఏసీ, మండల మహోద్యమం ఆధ్వర్యంలో ప్రత్యామ్నాయ రాజకీయ పార్టీ అవశ్యకత అనే అంశంపై సదస్సు జరిగింది. బీపీ మండల్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రాపోలు ఆనందభాస్కర్ మాట్లాడుతూ గతంలో ఇందిరాగాంధీ మండల్ కమీషన్ నివేదికను అమలు చేయలేకపోయారని, దానికి కారణం ఆనాటి బ్రాహ్మణ సమాజమేనని తెలిపారు. సామాజిక న్యాయ జేఏసీ కన్వీనర్ ప్రొఫెసర్ ప్రభంజన్ యాదవ్ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రత్యామ్నాయ రాజకీయ పార్టీ అనివార్యమైందని, అందుకు బడుగు, బలహీన వర్గాలందరూ ఐక్యం కావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. బలహీన వర్గాల్లో చైతన్యం తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సామాజిక న్యాయ జేఏసీ ప్రతినిధులు కోలా జనార్దన్, డాక్టర్ షోయబ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో యూనైటెడ్ బీసీ ఫ్రంట్ నాయకులు రామకృష్ణయ్య, మాస్టర్ జీ, బీఎల్ఎఫ్ చైర్మన్ నల్లా సూర్యప్రకాష్, ప్రొఫెసర్ వెంకటరాజయ్య, సంగిశెట్టి శ్రీనివాస్, పాలూరి లక్ష్మి, రాజకుమారి, గాలి అమరేందర్ తదితరులు పాల్గొని ప్రసంగించారు.

ఫాసిజాన్ని ఓడించాలి

టీపీటీఎఫ్ మాజీ అధ్యక్షులు నర్సింహారెడ్డి

ముషీరాబాద్: జార్జిరెడ్డి స్ఫూర్తితో విద్యార్థులు ఫాసిజాన్ని ఓడించాలని టీపీటీఎఫ్ మాజీ అధ్యక్షులు నర్సింహారెడ్డి అన్నారు. శనివారం పీడీఎస్‌యూ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు గడ్డం శ్యామ్ అధ్యక్షతన మార్క్స్ భవన్‌లో జార్జిరెడ్డి 52వ వర్ధంతి సందర్భంగా ×ఫాసిజం-విద్యార్థి ఉద్యమం®అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వచ్చిన నర్సింహారెడ్డి మాట్లాడుతూ నరేంద్ర మోదీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజల మధ్య కుల మత విభజన, విద్వేష రాజకీయాలతో రెచ్చగొడుతున్నారని అన్నారు. ప్రతిపక్ష పార్టీల గొంతు లేకుండా అక్రమంగా నిర్బంధిస్తున్నారని అన్నారు. బి.ప్రదీప్ మాట్లాడుతూ జార్జిని స్మరించడమంటే ఫాసిజాన్ని ఓడించడమే అని అన్నారు. జార్జిని హైదరాబాద్ చేగువేరా అని పిలుచుకునే వారమని తెలిపారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షులు మహేష్, గ్రేటర్ హైదరాబాద్ కార్యదర్శి శ్రీను, జిల్లా సహాయ కార్యదర్శి గౌతం, సాయి, ప్రవళిక, శ్రీజ, భార్గవి, మమత, జీవన్, గణేష్, మహేష్, పవన్, కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ ‘శ్రీరామ జెండాల’ పంపిణీ

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: బీజేపీ రాష్ట్ర కమిటీ సభ్యుడు సి.పార్థసారథి ఆధ్వర్యంలో బాగ్ లింగంపల్లిలో ఇంటింటికీ శ్రీరాముడి ప్రతిమ ఉన్న జెండాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ 17న చిక్కడపల్లిలోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయం నుంచి సంజయ్‌నగర్ బస్తీలోని హనుమాన్ దేవాలయం వరకు శోభాయాత్ర నిర్వహించనున్నట్లు తెలిపారు. పార్టీలకు అతీతంగా యాత్రను విజయవంతం చేయలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి గడ్డం సతీష్, ఆర్గనైజర్ జైపాల్‌రెడ్డి, కలకోట అరుణ్‌కుమార్, జ్యోతి, హర్ష, సూరి, కేశవ్, మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట



మినాజ్‌ను సన్మానించిన అరవింద్‌కుమార్

ముషీరాబాద్: మైనార్టీల సంక్షేమానికి సీఎం రేవంత్‌రెడ్డి పెద్ద పీట వేసి అన్నివిధాలా ఆదుకుంటున్నారని కాంగ్రెస్ యువజన కమిటీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఎం.అరవింద్ కుమార్ యాదవ్ అన్నారు. శనివారం ముషీరాబాద్‌లో రంజాన్ పర్వదినాలను పురస్కరించుకొని డాక్టర్ మినాజ్ ఆధ్వర్యంలో షీర్‌కుర్మా పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ముస్లింలు విద్యా, ఉద్యోగ, రాజకీయ రంగాలలో రాణించే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం అనేక పథకాలను చేపట్టిందని పేర్కొన్నారు. ఆరు గ్యారెంటీలను అమలు చేస్తూ ఆదర్శ ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి నిలిచారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ మినాజ్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ ముషీరాబాద్ నియోజకవర్గం బి-బ్లాక్ కమిటీ అధ్యక్షులు అంజియాదవ్, గ్రేటర్ కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షులు జనిగె శ్రీనివాస్‌యాదవ్, నక్కా కృష్ణాగౌడ్, భోలక్‌పూర్ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు జఫీరుద్దీన్, అల్లాఉద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

కిషన్‌రెడ్డిపై దానం విమర్శలా?: గౌతంరావు

కాచిగూడ: ప్రజల తీర్పును అపహాస్యం చేస్తూ పార్టీ ఫిరాయింపులకు పాల్పడే ఎమ్మెల్యే దానం నాగేందర్‌కు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిపై విమర్శలు చేసే నైతిక అర్హత లేదని బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతంరావు అన్నారు. శనివారం బర్కత్‌పురలోని బీజేపీ నగర కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నమ్మిన సిద్ధాంతం కోసం పనిచేసే కిషన్‌రెడ్డిపై దానం నాగేందర్ విమర్శలు చేయడం సిగ్గుచేటని అన్నారు. అంబర్‌పేటలో ఎన్నికల ప్రచారానికి వచ్చిన నాగేందర్ కేంద్రమంత్రి కిషన్ రెడ్డిపై చేసిన వ్యాఖ్యలు ఆయన అవగాహన రాహిత్యానికి నిదర్శనమని ధ్వజమెత్తారు. పార్లమెంట్‌లో ఆమోదించిన ఆర్టికల్ 370, సీఏఏ, త్రిపుల్ తలాక్ రద్దు, మహిళా రిజర్వేషన్ బిల్లు చర్చ సందర్భంగా కిషన్‌రెడ్డి క్రియాశీలక పాత్ర పోషించిన విషయం సికింద్రాబాద్ లోక్‌సభ నియోజకవర్గ ప్రజలకు తెలుసన్నారు. ప్రజల సమస్యలు ఏనాడూ పట్టించుకోకుండా విచ్చలవిడిగా అధికారాన్ని దుర్వినియోగం చేసేవారికి ప్రజలు పార్లమెంట్ ఎన్నికల్లో గుణపాఠం చెప్పడం ఖాయమన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటమి తప్పదని అన్నారు.

మతంపేరిట రాజ్య నిర్మాణానికి కుట్ర

బీజేపీ పై ప్రొఫెసర్ కంచ ఐలయ్య ధ్వజం



సదస్సులో మాట్లాడుతున్న కంచ ఐలయ్య

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: దేశంలో బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లు మతం పేరిట రాజ్యాన్ని నిర్మించాలని చూస్తున్నాయని ప్రొఫెసర్ కంచ ఐలయ్య విమర్శించారు. అందులో భాగంగానే అయోధ్యలో రామమందిర నిర్మాణం జరిగిందని అన్నారు. శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో కేవీపీఎస్, టీజీఎస్, టీపీఎస్‌కే తదితర ప్రజా సంఘాల ఆధ్వర్యంలో పూలే, అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకొని ‘రాజ్యాంగం ఎదుర్కొంటున్న సవాళ్లు’అనే అంశంపై సదస్సు జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న ప్రొఫెసర్ కంచ ఐలయ్య మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల ప్రజలు ఆత్మగౌరవంతో బతకాలంటే రాజ్యాధికారాన్ని సాధించాలని, అందుకు అంబేడ్కర్ మార్గమే శరణ్యమన్నారు. అయోధ్యలో రామమందిరం నిర్మించినట్లుగానే అంబేడ్కర్ పుట్టినచోట ఆయనకు అంతకంటే పెద్ద మందిరాన్ని నిర్మించాలని సూచించారు. రాజ్యాంగం సక్రమంగా అమలు జరిగేలా చూసుకోవాల్సి బాధ్యత బహుజనుల పైనే ఉందన్నారు. బడా కార్పొరేట్ కంపెనీల ప్రయోజనాల కోసమే కమలం పార్టీ పని చేస్తుందని విమర్శించారు. హిందూత్వ రాజ్యసాధనకు రాజ్యాంగం అడ్డుగా ఉందని, ఆర్ఎస్ఎస్ కనుసన్నల్లో నడుస్తున్న బీజేపీ రాజ్యాంగాన్ని రద్దు చేయడానికి పూనుకుందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.స్కైల్యాబ్‌బాబు, చేతివృత్తుల సమన్వాయ కమిటీ కోకన్వీనర్ ఉడతల రవీందర్, ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి ఎండి అబ్బాస్, కేవీపీఎస్ అధ్యక్షులు జాన్‌వెస్లీ, టిపిఎస్‌కే కన్వీనర్లు జి.రాములు, భూపతి వెంకటేశ్వర్లు, ఆర్.శ్రీరామ్‌నాయక్, ప్రొఫెసర్ అన్నపూర్ణ, జి.నరేష్ పాల్గొన్నారు.